సాక్షి
హనుమకొండ

శనివారం | 13 | జూలై | 2024



ఏడు దీవుల లక్నవరం
గోవిందరావుపేటలోని లక్నవరం సరస్సులోని ఏడు దీవుల్లో ఇప్పటికే మూడు దీవులు పర్యాటకులకు అందుబాటులో ఉండగా.. మిగతా దీవుల్లో పనులు కొనసాగుతున్నాయి. - 8లో▸



అండగా ఉంటాం..
తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరైన పిల్లలకు అండగా ఉంటామని, అధైర్యపడొద్దని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29^0 /25^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం సమయంలో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు
హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లు మరమ్మతు చేస్తున్నందున ఈనెల 13న(శనివారం) వరంగల్, హనుమకొండ, కాజీపేట, మడికొండ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. మడికొండ, మడికొండ టెక్స్‌టైల్స్ పార్క్, వెస్ట్ సిటీ, ఆర్ఈసీ, వడ్డేపల్లి, గోపాల్‌పూర్, కేయూసీ, పెద్దమ్మగడ్డ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, బాలసముద్రం ప్రాంతంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వనవిజ్ఞాన్, సిటిజన్ క్లబ్, ఆర్ట్స్ కాలేజీ, శాయంపేట, గోకుల్‌నగర్, నక్కలగుట్ట, భవానీ నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు తెలిపారు. వరంగల్‌లోని శంభునిపేట, కరీమాబాద్, మామునూరు, పోచమ్మ మైదాన్, ఆరేపల్లి, స్టేషన్ రోడ్, గొర్రెకుంట, ఖిలా వరంగల్ సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.1.58 లక్షల విలువైన గుట్కాలు స్వాధీనం



పరకాల: పరకాలలోని ఓ వ్యాపారి ఇంట్లో నిల్వ ఉన్న గుట్కాలను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో కిరాణా దుకాణం వ్యాపారి రేపాల చంద్రశేఖర్ ఇంటిపై దాడి నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.1.58 లక్షల విలువైన వివిధ రకాల గుట్కాలు, పొగాకు సంబంధిత ఉత్పత్తులు లభ్యమయ్యాయి. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్, ఎస్ఐ నిస్సార్ పాషా, ఏఎస్ఐ పీవీ రావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జోరుగా రిజిస్ట్రేషన్లు
- ఖజానాకు రూ.1.10 కోట్ల ఆదాయం

కాజీపేట అర్బన్: వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జోరుగా సాగింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా సర్వర్‌లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా.. కేవలం నాలుగు దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోగా.. మిగతా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో గురువారం మిగిలిన వాటితో పాటు శుక్రవారానివి కలుపుకుని 176 దస్తావేజులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నాయి. ఖజానాకు రూ.కోటి పది లక్షల ఆదాయం సమకూరింది.

నిట్‌లో ఇన్‌క్యామ్-24 సదస్సు
కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శుక్రవారం ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ అప్లైడ్ మెకానిక్స్(ఇన్‌క్యామ్)-24 సదస్సు నిట్ వరంగల్, ఇండియన్ సొసైటీ ఫర్ అప్లైడ్ మెకానిక్స్ సంయుక్తంగా ప్రారంభించారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ వివిధ రంగాల్లో పరిశోధనకు తోడ్పడుతుందని, ఇన్‌క్యామ్-24 సదస్సు నూతన పరిశోధనలకు వేదికగా నిలవాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ ఆకాంక్షించారు. ఈసందర్భంగా సదస్సు సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ యూఎస్ఏ ప్రొఫెసర్ జేఎన్.రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ మిసిసిప్పి ప్రొఫెసర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండలో ట్రాఫిక్ మళ్లింపు
వరంగల్ క్రైం: హనుమకొండ అశోకా జంక్షన్ నుంచి బస్టాండ్ వెళ్లే మార్గంలో రోడ్డు మరమ్మతుల కారణంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారుల నిర్ణయం మేరకు ఈనెల 14 అర్ధరాత్రి వరకు అటువైపు వాహనాలు వెళ్లకుండా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ వైపు వెళ్లే వాహనాలు ఏషియన్ మాల్, బాలసముద్రం, హనుమకొండ చౌరస్తా నుంచి అంజనేయస్వామి గుడి మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలని సూచించారు.

కలెక్టర్లను కలిసిన మార్నేని



కాళోజీ సెంటర్/హన్మకొండ: వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారదాదేవి, ప్రావీణ్యను కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పరకాల కేంద్రంగా 'రేషన్' దందా

ఇక్కడినుంచే హుజూరాబాద్, మహారాష్ట్రకు సరఫరా
- ఒకేరోజు 'టాస్క్‌ఫోర్స్'కు చిక్కిన 360 క్వింటాళ్ల రేషన్ బియ్యం
- గుట్టుచప్పుడు కాకుండా దందా.. పోలీసు దాడులతో బట్టబయలు
- ప్రభుత్వం నుంచి ధాన్యం... సీఎంఆర్ కింద రేషన్ బియ్యం
- 'మాఫియా' తరహాలో సాగుతున్న దళారుల దందా



నడికూడ మండలం చర్లపల్లిలో పట్టుబడిన పీడీఎస్ బియ్యం

సాక్షిప్రతినిధి, వరంగల్:

రేషన్ బియ్యం మాఫియా బరి తెగిస్తోంది. పోలీస్, పౌరసరఫరాల శాఖలకు సవాల్ విసురుతోంది. పరకాల కేంద్రంగా అడ్డా వేసిన బియ్యం మాఫియా... నడికూడ, ఆత్మకూరు తదితర చుట్టుపక్కల మండలాల గ్రామాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా దందా సాగిస్తోంది. గతంలో కమలాపూర్ కేంద్రంగా వ్యాపారం సాగించిన వ్యాపారులు.. ఆ మండలంతోపాటు పరకాల, నడికూడ, హసన్‌పర్తి మండలం అన్నసాగర్‌ను కూడా అడ్డాలుగా చేసుకున్నారు. గతంలోనూ ఈ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలువురిని అరెస్ట్ చేసిన 'టాస్క్‌ఫోర్స్' పోలీసులు వందల క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ ఈజీ మనీగా మారిన బియ్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

ఒకేరోజు 360 క్వింటాళ్ల రేషన్ బియ్యం..

మొదటి నుంచి నల్లబెల్లం, గుట్కా, రేషన్ బియ్యం అక్రమ దందాలకు పరకాల అడ్డా అనే పేరుంది. ఇటీవలి కాలంలో నడికూడ మండలం కూడా రేషన్ బియ్యం కేంద్రంగా మారింది. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం పరకాల సమీపంలో ఒకే రోజు జరిపిన దాడుల్లో మూడు వేర్వేరు చోట్ల సుమారు రూ.10 లక్షల విలువైన 360 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరికాయి. నడికూడ మండలం చర్లపల్లికి చెందిన బండి కుమార్, బండి శంకర్, తూర్పాటి అయిలయ్య (బుడిగ జంగాలకాలనీ)లను అరెస్ట్ చేశారు. బియ్యం రవాణా చేస్తున్న పరకాల మండలం కామారెడ్డిపల్లికి చెందిన ఐచర్ డీసీఎం వ్యాన్ డ్రైవర్ కొమ్మిడి మధుకర్‌రెడ్డి(33)ని కూడా అదుపులోకి తీసుకున్నారు. గతంలో కమలాపూర్ కేంద్రంగా రీ-సైక్లింగ్ చేసిన బియ్యాన్ని కరీంనగర్, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు చెందిన పలువురు రైస్‌మిల్లు వ్యాపారుల పేరిట కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)కింద తిరిగి ప్రభుత్వానికే చెల్లిస్తూ రూ.లక్షలు గడించిన దాఖలాలు ఉన్నాయి. పక్కా సమాచారంతో అప్పటి పోలీస్ అధికారులు జరిపిన దాడులతో రేషన్ బియ్యం దందా బాగోతం బట్టబయలైంది. 480 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడగా, ఐదు జిల్లాలకు చెందిన పలు రైస్ మిల్లుల పేరిట ముద్రించిన 'స్టిక్కర్లు' కూడా లభించడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అక్కడి నుంచి అడ్డా మార్చిన బియ్యం మాఫియా ఇప్పుడు పరకాల, నడికూడ ప్రాంతాల్లో నిల్వ చేస్తూ రైస్ మిల్లర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

'సీఎంఆర్'కు రేషన్ బియ్యం.. ఇక్కడి నుంచే సరఫరా..

దళారుల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని సీఎంఆర్ రూపేణా తిరిగి ప్రభుత్వానికే చెల్లిస్తూ రూ.లక్షలు గడిస్తున్న వ్యవహారం నిన్నటి పరకాల, మొన్నటి కమలాపూర్ ఘటనలు రుజువు చేస్తున్నాయి. 'భూమి గుండ్రంగా ఉంద'న్న చందంగా ఎక్కడి నుంచి వచ్చిన రేషన్ బియ్యం తిరిగి అక్కడికే చేరుతోంది. ఒక సీజన్‌కు చెందిన ధాన్యం మరో సీజన్ వచ్చేలోపు రైస్‌మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. ఆ బియ్యం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్‌డీలర్లకు చేరి, తిరిగి దళారుల ద్వారా బియ్యం మాఫియాగా మారిన కొందరు రైస్‌మిల్లర్ల వద్దకే చేరుతుండగా, తిరిగి ఎఫ్‌సీఐ, సీడబ్ల్యూసీ గోదాంలకు పంపుతున్నారు. ఈ తతంగం వెనుక రూ.లక్షలు వ్యాపారుల జేబుల్లోకి వెళ్తుండగా, పోలీసు దాడులతో అక్రమ బాగోతం బయటపడుతోంది.

ఎక్కడిదీ.. సిద్ధి వినాయక ఎంటర్ ప్రైజెస్?

పరకాల సమీపంలో శుక్రవారం 360 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్న 'టాస్క్‌ఫోర్స్' పోలీసులు.. ఆ బియ్యం ఎక్కడికి వెళ్తున్నాయోనన్న వివరాలు వెల్లడించలేదు. బండి శంకర్ ఇంట్లో నిల్వ చేసిన 80 క్వింటాళ్లు, తూర్పాటి అయిలయ్య ఇంట్లో 130 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు మొదట ప్రకటించారు. అదే విధంగా బండి కుమార్ ఇంట్లో 150 క్వింటాళ్ల బియ్యంతోపాటు.. బియ్యం తరలించడానికి సిద్ధంగా ఉన్న టీఎస్02యూడీ4653 నంబర్ గల ఐచర్ డీసీఎం వ్యాన్‌ను కూడా పోలీసులు సీజ్ చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి సేకరించిన ఆ బియ్యం ఎటు తరలిస్తున్నారనేది సస్పెన్స్ కాగా.. పోలీసులు స్వాధీనం చేసుకున్న టీఎస్02యూడీ4653 నంబర్ గల డీసీఎం వ్యాన్ 'సిద్ధి వినాయక ఎంటర్‌ప్రైజెస్' అనే ఫర్మ్ పేరిట రిజిస్ట్రేషన్ అయ్యింది. ఈ సిద్ధివినాయక ఎంటర్ ప్రైజెస్ ఎక్కడిది? హుజూరాబాద్, పరకాల, కమలాపూర్, వరంగల్ ప్రాంతాలకు చెందిందా? రేషన్ బియ్యం ఆ ఫర్మ్‌కే తరలుతున్నాయనడానికి ఆ సంస్థ పేరిట రిజిస్ట్రేషనైన డీసీఎం వ్యాన్ సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ విషయమై కూడా పోలీసులు లోతైన విచారణ జరపాల్సి ఉంది.

భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత
నడికూడ: రేషన్‌బియ్యం తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, పరకాల పోలీసులు సంయుక్తంగా శుక్రవారం రాత్రి మండలంలోని చర్లపల్లి గ్రామంలో దాడులు నిర్వహించారు. తూర్పాటి ఐలయ్య, బండి శంకర్, బండి కుమార్ ఇళ్లలో సోదాలు నిర్వహించగా.. దాదాపు 360 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.10లక్షల వరకు ఉంటుందని అంచనా. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, ఒక డీసీఎం వ్యాన్‌ను పరకాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సీఐ ఎస్.రవికుమార్, ఎస్సై నిస్సార్ పాషా, ఏఎస్సై పీవీ రావు, కానిస్టేబుళ్లు కృష్ణ, నవీన్, అంజయ్య, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విప్ర చిత్తా క్రమంలో స్నపనమూర్తికి అలంకరణ



మహా వజ్రేశ్వరీదేవిగా అమ్మవారు



విప్రచిత్తా, మహా వజ్రేశ్వరి క్రమాల్లో అమ్మవారు
హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో కొనసాగుతున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం అమ్మవారికి విప్రచిత్తా, మహా వజ్రేశ్వరి క్రమాల్లో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ఉదయం సుప్రభాతసేవ నిత్యాహ్నికం, చతుస్థానార్చనలు జరిపారు. అనంతరం అమ్మవారి స్నపనమూర్తిని కాళీక్రమమైన విప్రచిత్తా క్రమంలో, అమ్మవారి భోగబేరాన్ని షోఢశీక్రమంలో మహా వజ్రేశ్వరిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి
హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



అధికారులతో కలిసి మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో అధికారులతో కలిసి శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన 'హరితహారం' కార్యక్రమంతో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గ్రీన్ స్టేట్‌గా గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.రవీందర్, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఎంపీడీఓ గుండె బాబు, ఈజీఎస్ ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, మాజీ సర్పంచ్ అంకతి సాంబయ్య, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోతన హాస్టల్ గదిలో ఊడిన పెచ్చులు
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పోతన మహిళా హాస్టల్‌లో ఇటీవల ఓ గదిలో ఫ్యాన్ ఊడి మీద పడడంతో ఓ విద్యార్థినికి తీవ్రగాయాలై 12 కుట్లు పడ్డాయి. ఈ ఘటన మరువకముందే అదే హాస్టల్‌లో శుక్రవారం రాత్రి సుమారు 10గంటల ప్రాంతంలో 94వ నంబర్ గదిలోని పై స్లాబ్ కప్పు పెచ్చులూడి పడ్డాయి. ఆ సమయంలో గదిలో విద్యార్థినులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. పెళ్లలు కింద రెండు బెడ్స్‌పైన కూడా పడ్డాయి. యూనివర్సిటీ అధికారులకు చెప్పినా పోతన హాస్టల్‌ను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. వీరికి మద్దతుగా బాయ్స్ ఆందోళన కొనసాగిస్తున్నారు. నిరసన నినాదాలు చేశారు. సంబంధిత అధికారులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులను పోతన హాస్టల్‌నుంచి వేకెట్ చేయించి వేరే భవనంలోకి మార్చాలని కోరారు. రాత్రి 12 గంటల వరకు ఆందోళన కొనసాగింది.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



సమీక్షలో కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర అధికారులు

కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: వర్షాకాలం దృష్ట్యా నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య.. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. నయీంనగర్ వంతెన నిర్మాణ పనులు, చెరువు శిఖం ఆక్రమణలు, ఇతర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. సమావేశంలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు.

సోమవారం నాటి ప్రజావాణి రద్దు

కలెక్టరేట్‌లో సోమవారం రైతు భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నందున ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. దూర ప్రాంతాలనుంచి ప్రజావాణికి రావద్దని, అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరని పేర్కొన్నారు.

కడియం కాంగ్రెస్‌కు ఓటు వేశారా..?
బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

హన్మకొండ: పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌కు ఓటు వేసి ఉండకపోవచ్చని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ అంటే తనకు గిట్టదని తాను జీవితంలో కాంగ్రెస్‌కు ఓటు వేయనని చెప్పారని గుర్తు చేశారు. కేసీఆర్ కుటుంబం అవినీతిమయమైందని కడియం శ్రీహరి ఆరోపించారని, 10 ఏళ్లు అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్‌లో కొనసాగి ఉప ముఖ్యమంత్రిగా రెండో స్థానంలో ఉన్న మీకు ఈ అవినీతిలో వాటా ఎంత అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో హత్యలు, దాడులు, అత్యాచారాలు పెరిగాయని, శాంతి భద్రతలు క్షీణించాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై అమలు చేసే వరకు గ్రామస్థాయి నుంచి సోషల్ మీడియాలో ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. ఎస్సై, సీఐ, డీఎస్పీ, ఏసీపీ పోస్టింగ్‌లకు ఎమ్మెల్యేలు రేట్ నిర్ణయించడం ద్వారానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. తొర్రూరులాంటి ఘటన ఎక్కడైనా జరిగితే ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులం, కార్యకర్తలం ఇక నుంచి మూకుమ్మడిగా అక్కడకి వెళ్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలో రౌడీషీటర్లు నగరానికి దూరంగా ఉంటే.. నేడు ఆ రౌడీ షీటర్లు ఖద్దరు చొక్కాలు ధరించారని.... ఇదే వరంగల్‌లో వచ్చిన మార్పు అని ఎద్దేవా చేశారు. సమావేశంలో రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు, టీజీపీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మురుగు దారులు

మురికి కూపంలా అండర్, చిన్న బ్రిడ్జిలు
- ముక్కు మూసుకుని వెళ్తున్న పాదచారులు
- మురుగునీరు పడి పాడవుతున్న దుస్తులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వరంగల్ చిన్న బ్రిడ్జి కింద స్తంభించిన మురుగునీరు నీరు



డ్రైయినేజీ లీకేజీతో వరంగల్ అండర్ బ్రిడ్జి కింద పారుతున్న మురుగు నీరు

వరంగల్ అర్బన్: పేరుకే గ్రేటర్ వరంగల్.. ఎక్కడి మురుగు అక్కడే. రోడ్ల గురించైతే ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇంటి, చెత్త, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, భవన నిర్మాణ ఫీజులను ముక్కుపిండి వసూలు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ ప్రజలు పడుతున్న బాధల్ని పట్టించుకోవడంలో చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనం, బల్దియా అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా పాదచారులు, వాహనదారులు మురుగు కూపంలోనే రాకపోకలు కొనసాగిస్తున్నారు.

ముక్కు మూసుకుని..

వరంగల్ చిన్న బ్రిడ్జి, అండర్ బ్రిడ్జిల నుంచి నిత్యం లక్షలాది మంది వాహనదారులు, పాదచారుల ప్రయాణిస్తుంటారు. అత్యంత ముఖ్యమైన ఈ అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లాలంటే వాహనదారులు, పాదచారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే. వర్షం, వరదతో సంబంధం లేకుండా చిన్న బ్రిడ్జి వద్ద నిత్యం ఫీట్ ఎత్తు మేర మురుగు నీరు నిలుస్తోంది. ఇక అండర్ బ్రిడ్జి కింద మురుగునీరు లీకేజీగా మారి ప్రవహిస్తోంది. దుర్వాసన భరించలేక ఈరెండు బ్రిడ్జిల కింద నుంచి నడిచే ప్రజలు ముక్కు మూసుకుని, మోకాళ్ల వరకు దుస్తులు ఎత్తుకుని నడుస్తుంటారు. వాహనాలు పక్క నుంచి వెళ్తే మురుగు నీరు చిల్లి దుస్తులు పాడవుతున్నాయని అసహనానికి లోనవుతున్నారు. పాలకులను, బల్దియా అధికారులను, సిబ్బందిని తిడుతూ తప్పనిసరి పరిస్థితుల్లో నడక సాగిస్తున్నారు. చిన్న బ్రిడ్జి వద్ద డ్రైయినేజీ నీరు వచ్చి చేరుతోంది. అండర్ బ్రిడ్జి కిందకు డ్రైయినేజీ నుంచి మురుగు నీరు లీకై బ్రిడ్జి కిందికి వస్తోంది. నిత్యం ఈ రెండు అండర్ బ్రిడ్జిలో నీరు నిలుస్తోందని, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ దారిలో ప్రయాణిస్తున్న కార్పొరేటర్లు.. బల్దియా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టింపు కరువైందని పేర్కొంటున్నారు.

రూ.కోట్లు పోసినా కష్టాలు తప్పట్లే!

వరంగల్ అండర్ బ్రిడ్జి, చిన్న బ్రిడ్జి పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు రూ.కోట్లు వెచ్చించి నిర్మించారు. ట్రాఫిక్ ఇబ్బందులు మాత్రం తప్పాయి. ఇంత వరకు బాగానే ఉన్నా కానీ.. ఇంజనీర్ల శాస్త్రీయత కొరవడిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు బ్రిడ్జిల కింద డ్రైయినేజీల నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

దుస్తులు పాడవుతున్నాయి..



మా కాలనీ నుంచి హంటర్ రోడ్డుకు వెళ్లే దారిలో చిన్న బ్రిడ్జి నుంచి వెళ్లాలంటే ఒక్కోసారి మోకాళ్ల లోతు నీరు నిలిచి ఉంటోంది. తప్పనిసరి పరిస్థితుల్లో మురుగునీరు నుంచి నడవాల్సి వస్తోంది. ఈలోగా బండ్లు వస్తే మురుగునీరు చిల్లుతోంది. దుర్వాసన భరించలేకపోతున్నాం. ఈ బాధను ఎవరికి చెప్పాలి. మా నడక దారుల అవస్థలు ఎవరికీ పట్టడం లేదు.

- శాంతమ్మ, పెరుకవాడ, పాదచారి

మంత్రిని కలిసిన ఆర్ఎం



హన్మకొండ: రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను కలిశారు. ఇటీవల ఆర్ఎంగా బాధ్యతలు స్వీకరించిన డి.విజయభాను శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి కొండా సురేఖను ఆమె స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించారు. నూతనంగా నిర్మిస్తున్న వరంగల్ జిల్లా బస్ స్టేషన్ పనులపై చర్చించారు. ఆయన వెంట ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భానుకిరణ్ పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు

కలెక్టరేట్‌ను ముట్టడించిన ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ

విద్యారణ్యపురి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ), ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్ట్స్ కాలేజీ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి ధర్నా చేశారు. గేట్ వద్ద బైఠాయించి ధర్నా చేశారు. వారు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తర్వాత వదిలేశారు. కాగా.. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఇరువురు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు రూ.7వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ వేర్వేరుగా నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడిలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సుజిత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరుణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, కార్యదర్శి మంద శ్రీకాంత్, కళ్యాణ్, బాధ్యులు ఉన్నారు.

క్లుప్తంగా

సన్న బియ్యం పేరుతో మోసం

కాజీపేట: తక్కువ ధరలకే సన్నబియ్యం విక్రయిస్తామంటూ కొంతమంది వ్యక్తులు రేషన్ బియ్యం అంటగట్టి పలువురి నుంచి డబ్బులు కాజేసిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ టాటా ఏస్ వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు బీపీటీ సన్న రకం బియ్యం అంటూ 25 కిలోల బస్తాను చూపిస్తూ బియ్యాన్ని విక్రయించారు. సాధారణంగా మార్కెట్‌లో 25కిలోల సన్న బియ్యం బస్తా ప్రస్తుతం రూ.1,400 నుంచి రూ.1,500వరకు ఉంది. కానీ సదరు వ్యక్తులు రూ.1,000కే విక్రయించడంతో తక్కువ ధరకు వస్తుందని పలువురు ఎగబడి కొన్నారు. వారికి అనుమానం రాకుండా బియ్యం బస్తా పైభాగంలో ఉన్న బియ్యాన్ని చూపించి బురిడీ కొట్టించారు. తమ సెల్‌ఫోన్ నంబర్లను సైతం ఇచ్చి వారిని నమ్మించారు. బాధితులు ఇంట్లో బియ్యం బస్తా విప్పి చూడగా అందులోని పైభాగంలో మాత్రమే కొంతమేర సన్న బియ్యం ఉండగా కింద భాగమంతా రేషన్ బియ్యం ఉండడం చూసి కంగుతిన్నారు. దీంతో వారు ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్లకు కాల్ చేయగా.. స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఆవేదనకు గురై చేసేదిలేక మిన్నకుండిపోయారు.

'జెన్‌కో' అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈ నెల 14న నిర్వహించే టీజీ జెన్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గీసుకొండ: గ్రేటర్ పరిధిలోని 16వ డివిజన్ జాన్‌పాక మాస్టర్‌జీ పాఠశాలకు వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తి (38) హత్యకు గురయ్యాడు. గీసుకొండ పోలీసుల కథనం ప్రకారం.. జాన్‌పాకలో బలగాని అనిల్ ఇంటి నిర్మాణం పనులను చేపడుతున్నాడు. ఇందులో భాగంగా ఇంటి ఎదుట ఇసుక కుప్పను పోసుకున్నాడు. అడ్డా కూలీగా ఉన్న ఓ వ్యక్తి ఇంటి పని నిమిత్తం వచ్చి వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం బలగాల అనిల్‌కు ఇసుక కుప్పలో కూలీ మృతదేహం కనపడటంతో పోలీసులకు సమాచారం అందించాడు. అతడిని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి రాయితో తలపై మోది హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుడు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వాడిగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని గీసుకొండ సీఐ బాబూలాల్ సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 85031, 87126 85240 సెల్‌నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. మృతుడి వివరాలు తెలిస్తే అతడిని హత్య చేసింది ఎవరో తెలుసుకోవచ్చని సీఐ తెలిపారు.

ఏడు దీవుల లక్నవరం

ఆహ్లాదాన్ని పంచుతున్న సరస్సు, పరిసరాలు
- పర్యాటకులకు అందుబాటులో మూడు దీవులు
- మిగతా దీవులపై కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- అటవీ శాఖ ఉద్యానవనంలో జింకలు, చిల్డ్రన్స్ పార్కుల ఏర్పాటు
- దృష్టి సారిస్తే టూరిజం సెంట్రల్ పాయింట్‌గా గుర్తింపు


లక్నవరం వ్యూ (ఫైల్)

గోవిందరావుపేట: ప్రకృతి సహజసిద్ధ సోయగం.. ఏడుదీవుల వరం.. ములుగు జిల్లా గోవిందరావుపేటలోని లక్నవరం. వరంగల్ – భూపాలపట్నం జాతీయ రహదారి 163 నుంచి బూస్సాపూర్ గ్రామం మీదుగా సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నవరం సరస్సు పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. సరస్సులోని ఏడు దీవుల్లో ఇప్పటికే మూడు దీవులు పర్యాటకులకు అందుబాటులో ఉండగా.. మిగతా దీవుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర సమయంలో జంపన్నవాగులోకి లక్నవరం సరస్సు నీటినే వదులుతారు.

హరిత హోటళ్లు..

టూరిస్టులు ఉండటానికి సరస్సు మధ్యలో హరిత హోటళ్లు ఉన్నాయి. ప్రైవేట్ సదుపాయాలు కూడా ఉంటాయి. హరిత హోటళ్లలో డార్మిటరీ రూమ్స్ ఏసీ, నాన్ ఏసీ గదులు అందుబాటులో ఉంటాయి. గ్లాస్ రూమ్స్ కూడా ఉన్నాయి. ఈ గదుల వినియోగానికి ఒకరోజుకు రూ.2,000 నుంచి రూ.5,000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. పర్యాటకుల తాకిడి ఎక్కువ ఉండడం వల్ల ఆన్‌లైన్ లో కూడా టికెట్స్ అందుబాటులో ఉంచారు. ఫుడ్ కోసం రెస్టారెంట్‌లు కూడా ఉన్నాయి. లక్నవరంలో మూడు దీవుల్లో ప్రస్తుతం పర్యాటకులకు ఈ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మిగతా దీవుల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

మనసు దోచే ఊయల వంతెన..

లక్నవరం సరస్సు అందాలు చూడాలన్నా.. వర్ణించాలన్నా.. ఒక్కసారైనా పర్యటించాల్సిందే.. సరస్సు నీటిలో తేలియాడుతున్నట్లుగా ఊయల వంతెన పై నడుస్తూ చుట్టూ ఉన్న కొండలు, దీవులను చూస్తే కలిగే ఆనందం వర్ణనాతీతం. సరస్సులో బోటింగ్ చేస్తే వచ్చే హుషారే వేరంటారు.. పర్యాటకులు. కాకతీయ రాజులు ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి చేసిన ఈ సరస్సు సుమారు 5వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం.. 10వేలు, అనధికారికంగా మరో పదివేల ఎకరాలకు పైగా సరస్సు నీటితో వ్యవసాయ సాగుజరుగుతోంది. ప్రస్తుతం సరస్సు అభివృద్ధిపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారించింది. బ్రిడ్జి మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలుచుకునే గిరీశ్ భరద్వాజ్ డిజైన్ చేసిన ఈ బ్రిడ్జి ఆధారంగా ప్రభుత్వం మరో బ్రిడ్జిని నిర్మించింది.

ఆదాయం, ఆహ్లాదం..

వివిధ ప్రాంతాల నుంచి లక్నవరం వచ్చే పర్యాటకలకు మరింత ఆహ్లాదాన్ని, వన్య ప్రాణులను దగ్గర నుంచి చూసే అవకాశాన్ని కల్పించాలనే ఆలోచనతో అటవీ శాఖ అధికారులు చేసిన కార్యచరణ అద్భుతం. 2019లో పునరావాస కేంద్రంతోపాటు అటవీ శాఖ ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో దుప్పుల పునరావాస కేంద్రం కింద అటవీ శాఖ అధికారులు 20దుప్పులు, జింకలకు పకడ్బందీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పునరావాస పునరుత్పత్తి ఏర్పాటు చేశారు. అందుకు అణుగుణంగా లక్నవరం తరలివచ్చే వేలాది మంది పర్యాటకులను ఆకట్టుకునేందుకు అటవీ శాఖ ఉద్యానవనం పేరుతో అద్భుతమైన పార్కును తీర్చిదిద్దారు. ఇందులో రూ.7.50లక్షల ఎంపీ నిధులతో చిల్డ్రన్స్ పార్కును సైతం ఏర్పాటు చేశారు. ఈ ఉద్యానవనం సందర్శించేందుకు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 టికెట్ ఏర్పాటు చేసి ఆ నిధులతో మెయింటెన్స్ చేసేందుకు కార్యచరణ రూపొందించారు.


అటవీశాఖ పర్యావరణ ఉద్యానవనం


అడవిలో నుంచి లక్నవరం సరస్సుకు దారి

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

- రక్షణతోపాటు ఉద్యోగం కల్పిస్తాం
- పదహారు చింతల్ తండా బాధితులకు ఎమ్మెల్యే దొంతి పరామర్శ

చెన్నారావుపేట: తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరైన పిల్లలకు అండగా ఉంటానని, అధైర్య పడొద్దని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అభయమిచ్చారు. ఈ మేరకు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పదహారు చింతల్ తండాలో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన శ్రీనివాస్, సుగుణ దంపతుల పిల్లలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హంతకుడు నాగరాజుకు శిక్ష పడేలా చూస్తానని అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు ప్రభుత్వం తరఫున ఖర్చుల నిమిత్తం రూ.4.25లక్షలు అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తామని తెలిపారు. పిల్లల చదువులు, వారి రక్షణకు ప్రభుత్వం బాధ్యత తీసుకుని, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈసందర్భంగా బంధువులు, గ్రామస్తులు నిందితుడిని ఉరితీయాలని, తనకు ఉద్యోగం ఇప్పించాలని బాధితురాలు దీపిక ఎమ్మెల్యే మాధవరెడ్డిని వేడుకున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కలపెల్లి రవీందర్‌రావు, పీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఈ భయానక ఘటన నుంచి తండా ప్రజలు ఇంకా తేరుకోలేకపోతున్నారు. రెండు రోజులుగా సీఐ చంద్రమోహన్, ఎస్సై అరుణ్, జనగామ ఎస్సై రాజేష్‌కుమార్‌లు రేయింబవళ్లు తండాలో పికెటింగ్, బందోబస్త్ ఏర్పాటు చేశారు.

డైరెక్టర్, కలెక్టర్‌ను కలిసిన మార్కెట్ కార్యదర్శి


కలెక్టర్ సత్యశారదదేవికి పండ్ల బొకేను అందజేస్తున్న నిర్మల

వరంగల్: రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయిని హైదరాబాద్‌లో, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదదేవిలను వరంగల్ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన పి.నిర్మల శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పండ్ల బొకేలను అందజేసి శాలువాతో సన్మానించా రు. డీఎంఓ ప్రసాదరావు, మార్కెటింగ్‌శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి, ప్రధానకార్యదర్శి ఫసియొద్దీన్ (ముక్రం), రాష్ట్ర సభ్యుడు రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజేందర్. తదితరులు ఉన్నారు.

రిమాండ్‌కు తరలించకపోతే తడాఖా చూపిస్తాం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

నల్లబెల్లి: అశ్వారావుపేటలో ఎస్సైగా పనిచేసిన శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన సీఐ జితేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బందిని 24 గంటలలోపు ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించకపోతే మా తడాకా చూపిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలో శుక్రవారం ఎస్సై శ్రీను కుటుంబాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం పరామర్శించింది. శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. సీఐ, సిబ్బంది వేధింపులు, అవమానాలు భరించలేక ఎస్సై ఆత్మహత్య చేసుకున్నారంటే పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి ఎస్సై కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలని, ఆత్మహత్య చేసుకున్న ఎస్సై కుటుంబానికి న్యాయం చేయాలని వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్, ఎస్సీ, ఎస్సీ కమిషన్ సభ్యులు నూనవత్ రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్, రాంబాబు, జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి, వివిధ సంఘాల నాయకులు రాజేందర్, సురేష్, మహేందర్, అజ్మీరా వెంకట్ పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం పనులు వేగిరం చేయండి


అధికారులకు సూచనలిస్తున్న ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

నయీంనగర్: సెప్టెంబర్ 9లోగా ప్రజాకవి కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తయ్యేలా అధికారులు పనులను వేగవంతం చేయాలని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి కళాక్షేత్రం నిర్మాణ పనుల్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి కళాక్షేత్రం నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారని, సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా కళాక్షేత్రం ప్రారంభించాలని ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. జీ ప్లస్ ఫోర్ మోడల్‌లో నిర్మిస్తున్న కళాక్షేత్రంలో ఒక్కో అంతస్తులో ఒక ప్రత్యేకత ఉండేలా జరుగుతున్న సూపర్ స్ట్రక్చర్ నిర్మాణం, ఇంటీరియర్, మెకానికల్, ఎలక్ట్రికల్, ల్యాండ్ స్కేపింగ్, పాత్ వే, ప్రీ ఫంక్షన్ హాల్, ఫుడ్ కౌంటర్, క్యాట్ వాక్ లాబీల నిర్మాణ పనులు పరిశీలించి పనుల్ని వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో 'కుడా' సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పాడి, మత్స్యరంగానికి అనువైంది

- డాక్టర్ ఏకాంబరం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

కాజీపేట రూరల్: తెలంగాణ ప్రాంతంలో పాడి, మత్స్యరంగానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని డాక్టర్ ఏకాంబరం అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లో గల బాలవికాస సెంటర్‌లో శుక్రవారం పీ.వీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉత్తర, మధ్య తెలంగాణ మొదటి ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఏకాంబరం మాట్లాడుతూ యూనివర్సిటీ అధికారుల, శాస్త్రవేత్తలు, నిపుణుల సూచన మేరకు మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక లాభాలు పొందాలని రైతులకు సూచించారు. యూనివర్సిటీ విస్తరణ సలహాదారుడు డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు పరిశోధన ద్వారా కనుగొన్న టెక్నాలజీలను రైతుల వరకు తీసుకెళ్లే బాధ్యత పశుసంవర్ధక శాఖ, విస్తరణ విభాగంపై ఉందన్నారు. ముఖ్య అతిథులు వివిధ శాఖల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ రాజన్న, వరంగల్ జాయింట్ డైరెక్టర్ డా.బాలకృష్ణ, హనుమకొండ జాయింట్ డైరెక్టర్ కేవీ నారాయణ, డాక్టర్ అమరేశ్వరీ, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ శశాంక్, సాయికిరణ్, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆటో దొంగల అరెస్ట్


నిందితుల అరెస్టు చూపుతున్న సత్యనారాయణరెడ్డి

వరంగల్ క్రైం: హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన రమేశ్ పట్నాయక్ ప్రస్తుతం మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో ఉంటుండగా, వేముల సంతోష్ జనగామ జిల్లా బచ్చన్నపేటలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సుబేదారి ఏరియాలో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో నిందితుడు సంతోష్ ఒక ఆటోలో వెళ్తుండగా పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. అతన్ని విచారించగా పట్నాయక్‌తో కలిసి ఆటోలను దొంగిలించి అమ్ముతున్నట్లు తెలిపాడు. రాత్రి వేళ పార్కు చేసిన ఆటోలను దొంగిలించి హనుమకొండ హంటర్‌రోడ్డులోని గుట్టల పక్కన ఉన్న పొదల్లో దాచిపెట్టినట్లు చెప్పగా పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5 లక్షల వరకు ఉంటుంది. ఈ మేరకు పట్నాయక్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి అభినందించారు.

వేద పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలోని శ్రీభద్రకాళి సాంగ ఆగమ సంస్కృత వేద పాఠశాలలో వైదిక స్మార్త ఆగమం, తైత్తిరీయ కృష్ణయజుర్వేదాధ్యయనంలో ప్రవేశం పొందాలనుకునే ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని భద్రకాళి దేవాలయ కార్యనిర్వహణాధికారి, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 12 ఏళ్ల వయస్సు కలిగి మాతృభాషలో చదవడం, రాయడం, ఉప నయన సంస్కారం, ఉపాకర్నోత్సర్జనములు పూర్తి అయినవారు, సంధ్యావందనం, అగ్నికార్యం, బ్రహ్మయజ్ఞాలు కంఠస్థం వచ్చిన విద్యార్థులు పాఠశాలలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. శనివారం నుంచి వేద పాఠశాలలో దరఖాస్తు ఫారాలు ఇస్తామని, పూరించిన దరఖాస్తులను ఈనెల 22వ తేదీ వరకు వేద పాఠశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఫోర్టిఫైడ్ రైస్ అందుబాటులోకి తీసుకురావాలి

హన్మకొండ: ఫోర్టిఫైడ్ రైస్ అందరికీ అందుబాటులో తీసుకురావాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అందరికీ సంపూర్ణ పౌష్టికాహారం, ముఖ్యంగా కల్తీలేని భోజ నం అందించడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఫోర్టిఫైడ్ రైస్ విధానంపై చాలా వరకు రైస్‌మిల్లర్లలో అవగాహన లేకపోవడం, ఆహార కల్తీ నిరోధక శాఖ, పౌరసరఫరాల శాఖల మధ్య సమన్వయ లోపంతో ఫోర్టిఫైడ్ రైస్ పేరిట నాసిరకం బియ్యం పంపిణీ జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ రైస్ విధానంపై రాష్ట్ర వ్యాప్తంగా 'ఆహార సర్వే' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమ సమితి ప్రతినిధులు అనిల్‌కుమార్, ప్రవీణ్, శ్రీనివాస్, రత్నాకర్, రంజిత్ కుమార్, అశోక్ కుమార్, శ్యాంసుందర్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కల్పించే కరపత్రాలు ఆవిష్కరించారు.

ఎంజేపీలో ర్యాగింగ్

భరించలేక తప్పించుకున్న 19 మంది పిల్లలు
- ఐదు కిలోమీటర్ల దూరంలోని పాత ఎంజేపీకి రాక
- హాస్టల్ వద్ద ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు
- ప్రిన్సిపాల్, టీచర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం


ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

జనగామ: సీనియర్, జూనియర్ విద్యార్థుల ర్యాగింగ్.. గెస్ట్ టీచర్ల వెటకారం మాటలు.. చీటికి మాటికి ఫిర్యాదులతో విసిగిపోయిన 19 మంది విద్యార్థులు గోడదూకి తప్పించుకున్న ఘటన పెంబర్తి మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో శుక్రవారం జరిగింది. బాధిత విద్యార్థులు బాలాజీ, టి.సాత్విక్, వి.సకిరానందన్, ఎం.భరత్, బి.విగ్నేష్, కార్తీక్, వినయ్, ఎం.రామ్‌చరణ్, ఎస్.శ్రీచరణ్, టి.విగ్నేష్, సీహెచ్.రామ్‌చరణ్, రుషి, హవీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా కేంద్రం ధర్మకంచ రైల్వేట్రాక్ ఏరియాలోని బాలుర ఎంజేపీలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ కావడంతో 154 మంది(8, 9వ తరగతి)ని పెంబర్తి ఎంజేపీ(బచ్చన్నపేటకు చెందిన)లో 20 రోజుల క్రితం చేర్పించారు. ఇక్కడి సీనియర్, జూనియర్ విద్యార్థులు ఇటీవల వచ్చిన పిల్లలను ర్యాగింగ్ చేస్తున్నారు. వాటర్ సంప్‌లో అపరిశుభ్రత వాతావరణం కలిగేలా చేయడంతో వద్దని జనగామ నుంచి వెళ్లిన విద్యార్థులు వారించగా.. వారిని వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. సంప్ వాటర్ అపరిశుభ్రం కావడంతో పైపులైన్ వద్ద బకెట్లతో నీరు తెచ్చుకుని కాలకృత్యాలు తీర్చుకుంటున్నామని బాధిత విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లు సైతం ప్రేయర్‌లో జనగామ బాయ్స్ బ్యాడ్ అనేలా వ్యవహరించారని కన్నీటి పర్యంతమయ్యారు. గెస్ట్ టీచర్లు బూతులు మాట్లాడుతూ అవహేళన చేశారని ఆరోపించారు. ఈ విషయమై కొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్‌కు చెప్పినా పట్టించుకోలేదని, ఏ సంఘటన జరిగినా తమను బాధ్యులను చేస్తున్నారని వాపోయారు. ఇక అక్కడ ఉండకూడదని నిర్ణయించుకుని తెల్లవారుజామున గోడదూకి కాలినడకన సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జనగామ పాత ఎంజేపీకి వచ్చేసినట్లు వివరించారు. పెంబర్తి గురుకులంలో భోజనం, కూర, చారు కూడా నాణ్యత లేక ఒక్క పూట కూడా తినలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. పిల్లలు పారిపోయారని సమాచారం అందుకున్న తల్లిదండ్రులు గురుకులం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేను కొత్తగా వచ్చాను..



పెంబర్తి ఎంజేపీకి ఇటీవలే వచ్చాను. జూన్‌లో 154 మంది పిల్లలు జనగామ నుంచి వచ్చారు. గొడవలు జరిగే విషయం నాకు తెలియదు. అయినా రోజూ నిఘా ఉంటుంది. నైట్ వాచ్‌మన్ పర్యవేక్షిస్తారు. పిల్లలు ప్లాన్ చేసిన సంగతి పసిగట్టలేకపోయాం. ర్యాగింగ్‌పై విచారణ చేయిస్తాం. అటువంటిది జరగలేదని అనుకుంటున్నాం. పై అధికారులకు సమాచారం ఇచ్చాం.
– చంద్రమౌళి, పెంబర్తి ఎంజేపీ ప్రిన్సిపాల్

క్రీడల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

- కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి
- ముగిసిన రీజినల్ స్పోర్ట్స్ మీట్


విజేతలను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి

కాజీపేట అర్బన్: క్రీడల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి అన్నారు. కాజీపేట మండలం కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో నిర్వహిస్తున్న తెలంగాణ, ఏపీ రీజినల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో టేబుల్ టెన్నిస్ విభాగంలో అండర్–14 విభాగంలో బాయ్స్ అండ్ గర్ల్స్ కేవీ వాల్తేరు ప్రథమ స్థానంలో నిలిచారు, అండర్–17 విభాగంలో కేవీ వాల్తేరు బాలికలు, కేవీ తిరుపతి బాలురు ప్రథమ స్థానంలో, అండర్–19 విభాగంలో కేవీ విశాఖపట్నం బాలికలు, ఒంగోలు బాలురు ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ వరంగల్ విద్యార్థులు కె.ఆనంతశ్రీ,, పి.శ్రీజా, సిహెచ్.సూర్య, కె.కోదండరామ్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విజేతలను, జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సుభాషిణి అభినందించారు. కార్యక్రమంలో కేవీ పీఈడీ కొర్ర శ్రీనివాస్, హైదరాబాద్ రీజియన్ పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.